# ఉపాధి భేదములు దూరము చేసినప్పుడే ఏకాత్మతత్త్వము అలవడుతుంది

**కానబడుచున్న జగతిలో కానరాక**
**అందు వెలుగొందు చైతన్యమాత్మరూపు**
**మణులయందలి సూత్రము మాదిరిగను**
**విశ్వమంతయు నిండెను విశ్వవిభుడు**

**కాలముబట్టి సర్వమును కల్గుచుండును మంచిచెడ్డలున్**
**కాలముబట్టి వచ్చెడివి కల్మికి లేమికి రాకపోకలున్**
**కాలమె అన్నిరీతులకు కారణమెంచి చూడ నీ**
**కాలము లొంగదీయని మనుష్యుడొకండును లేడుగా ధరన్.**

ప్రేమస్వరూపులారా!

కాలము ప్రచండమారుతమువలె అతి వేగంగా కదలిపోవుచున్నది. కాయమునకు కేటాయించిన ఆయుఃప్రమాణము మంచుగడ్డవలె క్షణక్షణమునకు కరిగిపోవుచున్నది. కానీ, మానవుడు కర్తవ్యమును గుర్తించుటకు పూర్వమే కాయమును వదలుతున్నాడు. 'దుర్లభో మానుషో దేహః.' పవిత్రమైన మానవజన్మనెత్తియు కర్తవ్యమును గుర్తించక కాలమును వ్యర్థము గావించుచు తన కాయాన్ని దుర్వినియోగపరచుకోవటం మానవునియొక్క ప్రధాన లక్ష్యముకాదు. కనుక, ప్రతి మానవుడు కాలమును సార్థకము గావించుకునే కర్మలాచరించి కర్తవ్యమును గుర్తించి తన కాయమును పవిత్రము గావించుకోవాలి.

srisathyasaivachanamrutam

## తనను తాను తెలుసుకొనలేకపోవటమే పెద్ద బంధన

మానవుడు సంకల్పించి సాధించలేనిదంటూ ఒకటిలేదు, యీ జగత్తులో. కానీ, అట్టి సాధనకు పూర్వము తనయొక్క శక్తిని, తనయొక్క తత్త్వమును గుర్తించి వర్తించాలి. ఈనాటి మానవుడు అన్నియూ తెలుసునని ఆకాశమునకు ప్రాకుతున్న వ్యక్తి. ఆనందానికి నోచుకోలేకపోతున్నాడు. కారణం ఏమిటి? చుక్కలను లెక్కించినా, చంద్రునిపైన కాలిడినా, తనను తాను లెక్కించుకొనక తనను తాను గుర్తించుకొనలేనప్పుడు మానవునియందు సమగ్రతా భావము క్షీణిస్తుంది. సమగ్రతా భావము బాహ్యదృష్టికి కూడినటువంటిది కాదు. సమగ్రత అంతర్దృష్టికి సంబంధించినటువంటిది. సమగ్రతాభావము సంపూర్ణముగా వుండినప్పుడే నిజమైన ద్రష్ట కాగలడు. అట్టి ద్రష్టకే ఆనందము ప్రాప్తించును. ఐతే 'బంధన, బంధన', అని మానవుని బంధించిన బంధనలు ఏమిటి? బంధన ఏమిటో గుర్తించినప్పుడే దానిని విమోచన గావించుకొనుటకు తగిన కృషి చేయగలడు మానవుడు. ఆలుబిడ్డలా? బంధన కాదు. ఆస్తిపాస్తులా? అది కాదు. విషయాలకు సంబంధించిన ఆశలా? కాదు. తనను తాను తెలుసుకొనలేకపోవటమే పెద్ద బంధన. తనను తాను తెలుసుకొనలేనటువంటి వ్యక్తికి దుఃఖము తప్పినదికాదు.

## దైవభావము ఆవిర్భవించినప్పుడే దుఃఖము వీడి ఆనందము ప్రాప్తిస్తుంది

దుఃఖము వుండినంతవరకు ఆనందము ప్రాప్తించదు, కనుక, మానవునకు ఆవరించిన దుఃఖములు ఏవి? యివి మూడు విధములుగా ఆవరించి అనేక విధములుగా బాధించుచున్నవి. అసత్తువల్ల ప్రాప్తించే దుఃఖము ఒకటి. తమస్సువల్ల ప్రాప్తించే దుఃఖము రెండవది. మృత్యువువల్ల లభించే దుఃఖము మూడవది. వీటినే వేదాంత పరిభాషయందు ప్రకృతి, జీవుడు, పరమాత్మ అని మూడు పదములుగా విభజించడం జరిగింది. వదలవలసినవి వదలనంతవరకు మానవునికి ఆనందము ప్రాప్తించదు. తెలుసుకోవలసినది తెలుసుకోనంతవరకు మానవునకు ఆనందము ప్రాప్తించదు. ఐతే, వదలవలసినది ఏమిటి? తెలుసుకొనవలసినది ఏమిటి? చేరవలసిన స్థానము ఏమిటి? వీటినే విచారించాలి. మనము వదలవలసినది జగద్భావమును. కారణమేమనగా, జగత్తు

sri sathyasai vachanamrutam

భగవంతునికంటె వేరైనది కాదు. 'ఈశావాస్య మిదం జగత్' భగవంతుడు నివసించేటువంటిది జగత్తు. 'విశ్వం విష్ణుస్వరూపం'. ఈ విశ్వమంతయు భగవంతుని ఆకారమే! అట్టి పవిత్రమైన దైవభావమును విసర్జించి జగద్భావమునే విశ్వసించి మానవుడు దుఃఖమునకు గురౌతున్నాడు. జగత్తును జగద్భావముగా భావించక జగదీశ్వర భావముగా మనము విశ్వసించటము అత్యవసరము. దైవభావము మానవునియందు ఆవిర్భవించినప్పుడే దుఃఖము మనకు వీడి ఆనందము ప్రాప్తింపజేస్తుంది. కనుక, వీడవలసినది జగద్భావము. అప్పుడే మనకు ఆత్మానందము చేకూరుతుంది. రెండవది, జీవభావము వదలాలి. జీవుడనగా ఎవరు? జీవుడే దేవుడు. ఈ యొక్క జీవతత్త్వాన్ని మనం గుర్తించాలనుకున్నప్పుడు

**జీవుడుండు దేహమందు హృదయమందు దేవుడుండు**
**రెండుకూడి ఆటలాడి ఒకరినొకరు వీడకుండ్రు**
**బొమ్మలాటలాడించే సూత్రధారి కలడొకండు**
**మంచి చెడ్డ బొమ్మలుండు ఒకటిలోనె రెండు ఉండు.**

కనుక, జీవత్వము, దైవత్వము అని రెండు భాగములుగా లేదు. అజ్ఞానముచేత ఉన్న సత్యాన్ని మరచి లేని అసత్యమును భ్రమించి దుఃఖమునకు గురౌతున్నాడు మానవుడు. త్రాడును చూచి పామని భ్రమిస్తున్నాడు. కానీ, తాను గుర్తించిన తరువాత యిది త్రాడు అని తెలుసుకున్నప్పుడు పాముయొక్క భీతి అంతర్ధానమవుతుంది. పూర్వము పాము లేదు. త్రాడు రాలేదు. గుర్తించిన తరువాత పాము లేదు, త్రాడు రాలేదు. పూర్వమున్నది, యిప్పుడున్నది త్రాడే. కనుకనే, జగత్తును చూచి మానవుడు యిది కేవలము జీవతత్త్వమని భావిస్తున్నాడు. కానీ, యీ జగత్తు భగవత్స్వరూపము. ఈ యొక్క ఈశ్వరత్వమును మనం చక్కగా అర్థము చేసుకున్నప్పుడు యీ జగత్తనే భ్రమకానీ జీవతత్త్వమనే భ్రమగాని మననుండి వీడిపోతుంది. కనుక, జీవుడనేవాడు దేవుడనే సత్యాన్ని గుర్తించినప్పుడే దుఃఖము మననుండి దూరమవుతుంది.

srisathyasaivachanamrutam

**విశ్వమందు విభుడు వెలుగొందుచుండు**
**విభునియందు వెలుగు విశ్వమెపుడు**
**విశ్వవిభుల మైత్రి విడదీయరానిది**
**సత్యరత్నాల మూట సాయిమాట.**

దుఃఖము ప్రకృతియొక్క సంపదనియు, ఆనందము దైవసంపదనియు భావిస్తూ వుంటారు. ఇది చాలా పొరపాటు.

**కష్టసుఖములు రెండును కలసియుండు**
**వాని విడదీయనెవరికి వశముగాదు**
**సుఖము ప్రత్యేకముగనెందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖంబటంద్రు.**

కష్టసుఖములు రెండును వేరుకాదు. దారము, వస్త్రము రెండు ఒక్కటే! దారము విడదీస్తే వస్త్రము లేదు. అదే విధముగనే దైవత్వము వేరు చేసిన జీవత్వమే లేదు. జీవత్వమునే వేరు చేసిన జీవితమునకే అర్థము లేదు. కనుక జీవుడే దేవుడు అనే సత్యమును గుర్తించుట అత్యవసరము. అప్పుడే మానవునికి దుఃఖము దూరమవుతుంది.

**నిన్ను నీవు చూసుకోవటమే సాక్షాత్కారము**

ఇంక చేరవలసిన స్థానము ఏమిటి? అదే తన స్వస్థానము. తన స్వస్థానము ఏమిటి? తనను తాను తెలుసుకోవటమే స్వస్థానము. తనను తాను తెలుసుకునే నిమిత్తమే తనువును అనుగ్రహించాడు భగవంతుడు. తనను తాను ఎక్కడ వెతకటం? నిన్ను నీవు ఎక్కడైనా బయట ప్రదేశములో వెదకటానికి వీలుకాదు. అదే విధముగా దైవత్వమును వెతకటమంటే కేవలము వెట్టితనము. "సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం సర్వతః శృతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి." అంతయు తానే అయివుండికూడను తనను తాను వెదకటానికి ప్రయత్నిస్తున్నాడంటే యీ మానవుడు వెట్టివాడనే చెప్పవచ్చును. కనుక, తనను తాను గుర్తించుకోవటమే స్వస్థానమునకు చేరటం. దీనినే వేదాంత పరిభాషయందు 'నేతి, నేతి' అని ఉచ్చరించారు. దేహము నేను కాదు. మనస్సు నేను కాదు. బుద్ధి నేను కాదు. చిత్తము

srisathyasaivahanamrutam

నేను కాదు. అంతఃకరణ నేను కాదు. ఈ దేహము, బుద్ధి, చిత్తము, అంతఃకరణ, అన్నియు నావి అనుకోవాలి. ఇవన్నీకూడను పని ముట్లు. దీనికంతా మాష్టరు నీవే. కనుక నీవు "నేను ఒక యజమానుడను, నేను సర్వస్వరూపుడను" అనే సత్యమును గుర్తించినప్పుడు యీ దుఃఖము యేమాత్రము బాధించదు. ఆత్మను వెతకవలసిన బుద్ధితో యీనాడు మానవుడు అన్నాన్ని వెతకటానికి ప్రయత్నిస్తున్నాడు. నీ ముఖమును నీవు చూచుకోమని అద్దము నీ ముందు పెడితే, ఆ అద్దమును తీసుకొని వెళ్లి యింకొకరి ముందు పెట్టినప్పుడు నీ ముఖము యే రీతిగా కనుపిస్తుంది? కనుక, 'బుద్ధి' అనే అద్దముతో నిన్ను నీవు గుర్తించటానికి ప్రయత్నించాలి. బుద్ధి అనే అద్దమునందు నిన్ను నీవు దర్శించాలి. అదే 'సాక్షాత్ ఆకారం' సాక్షాత్కారమని. నిన్ను నీవు చూసుకోటమే సాక్షాత్కారము.

## సృష్టికర్తను గుర్తించినప్పుడు సృష్టిరహస్యము మనకు బట్టబయలైపోతుంది

దురదృష్టవశాత్తు యీనాడు జగత్తునందు తనను మరచి అన్నింటిని వెతకటానికి ప్రయత్నిస్తున్నాడు మానవుడు. ఎదురైన వ్యక్తులందరిని 'నీవెవరు? నీవెవర'ని ప్రశ్నిస్తున్నాడు. కాని నేనెవరు? అని తనను తాను ప్రశ్నించుకోటానికి ప్రయత్నించటంలేదు. తనను తాను గుర్తించుకోలేని వ్యక్తికి 'నీవెవరు?' అని ప్రశ్నించే అధికారము ఎక్కడనుండి వస్తుంది? కనుక, లేని అధికారము చెలాయించటానికి పూనుకోటంవలనే అజ్ఞానము అతనిని ఆవరిస్తున్నాది. ఇది ఒక పెద్ద అజ్ఞానము. ఈ అజ్ఞానము ఆవరించినంతవరకుకూడను, తనను తాను గుర్తించుకోలేనంతవరకుకూడను, ఆనందము అతనికి ప్రాప్తించదు. ఆనందము వచ్చేంతవరకు దుఃఖమును అనుభవించక తప్పదు. కనుక, యిట్టి దివ్యతత్త్వాన్ని, ఏకత్వాన్ని ప్రబోధించే నిమిత్తమై యీ నూతన సంవత్సరములు హెచ్చరిస్తూ వస్తున్నాయి. భగవంతుడు కాలస్వరూపుడు. కాలస్వరూపుడగుటచేతనే అతనికి 'సంవత్సరాయ నమః' అని పేరు. సర్వము తనయందు వుంచుకున్నవాడు కనుకనే 'సంవత్సరుడు' అని మరొకపేరు. ఇట్టి కాలమునే ఆత్మగా వుంచుకున్నవాడు కనుకనే అతనికి 'కాలాత్మకు'డని మరొక పేరు. కాలమునకు 'ధీమంతుడు' అని మరొక పేరు. ఈ

sri sathyasai vachanamrutam

ధీమంతులను రక్షించే నిమిత్తమై కాలస్వరూపుడైన పరమాత్ముడు అవతరిస్తున్నాడు. ధీమంతుడనగా ఏమిటి? కేవలము బుద్ధిబలము, యోచనాశక్తి, మేధాశక్తి అధికముగా వుండి సర్వము విచారించి పరిశోధనలు సల్పి విజ్ఞానము అభివృద్ధిగావించుకొనటము కాదు, ధీమంతునియొక్క లక్షణము. పరిపరివిధముల పరమాత్మునిలో బుద్ధిని ప్రవహింపచేయటం ధీమంతుని లక్షణము. ఈ బుద్ధిని ప్రాకృతమైన మార్గములో ప్రవేశపెట్టటంకాదు, ధీమంతుని లక్షణము. ఈ బుద్ధిని పరిపూర్ణముగా భగవంతునిపైన మరల్చటమే ధీమంతుని లక్షణము. దైవాన్ని గుర్తించినప్పుడు సర్వము గుర్తించగలుగుతావు. దురదృష్టవశాత్తు యీనాడు creator ను మరచి creation ను పట్టుకొని అనేక పరిశోధనలు గావిస్తున్నాడు మానవుడు. కనుకనే సృష్టికర్తను మనం చక్కగా గుర్తించినప్పుడు సృష్టి రహస్యము మనకు బట్టబయలైపోతుంది.

సంవత్సరము అనగా సర్వస్వరూపమైన జగత్తే సంవత్సర స్వరూపము. ఇతడు నాలుగు విధములైన విభూతులతో ఆత్మస్వరూపునిగా భావింపబడుతున్నాడు. ఇతనికే 'చతురాత్మ' అని మరొక పేరు. 'చతురాత్మ' అనగా 3 విధములైన విభూతులతో కూడిన ఆత్మనే చతురాత్మ. మొదటిది 'వాసుదేవ'. రెండవది 'సంకర్షణ'. మూడవది 'అనిరుద్ధ'. యీ మూడింటి తత్వాన్ని చక్కగా గుర్తించుకున్నప్పుడు 'ప్రద్యుమ్న' అనే నాల్గవది మనకు సులభముగా అర్థమవుతుంది. మొట్టమొదటిది 'వాసుదేవ'. వాసుదేవుడనగా 'ఈశావాస్య మిదం జగత్'. జగత్తంతా నివసించినవాడు వాసుదేవుడు. జగత్తునంతయు తన వశము చేసుకున్నవాడు వాసుదేవుడు. కనుక, వాసుదేవుడనగా సర్వభూతములందు తాను ఆత్మస్వరూపుడై వుంటున్నాడు. అందరియందు మాత్రమేకాక సర్వత్ర వ్యాపించినవాడు వాసుదేవుడు. దీనినే 'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థితః' అన్నారు. లోపల, వెలుపల సర్వత్ర వుండినవాడు యీ వాసుదేవుడే! వసించిన దేవుడు కనుకనే యితనికి 'వాసుదేవుడ'ని పేరు.

రెండవది సంకర్షణుడు. సంకర్షణుడనగా సర్వజీవులను తనవైపు ఆకర్షింప చేసుకునేవాడు. అనగా, తననుండియే సర్వజీవులను ఆవిర్భవింప

srisathyasaivachanamrutam

చేసుకున్నటువంటివాడు. ఒక స్థానమునుండి మరొక స్థానమునకు తాను సంకర్షణ గావించేవాడుకనుకనే యితనికి 'సంకర్షణుడ'నికూడను పేరు. మార్చగలిగినటువంటి శక్తి గలవాడు. దేవకీదేవియందున్న గర్భమును రోహిణి గర్భమునందు సంకర్షింపచేసుకున్నాడు. కనుకనే, అతనికి సంకర్షణుడని మరొక పేరు. సం-కర్షణ. ఆకర్షణ. సం-అనగా పవిత్రత. పవిత్రతను ఆకర్షించేవాడు. సకారమనేది సాలోక్య సారూప్య సాన్నిధ్య, సాయుజ్యములకు సంబంధించినదే. ఇట్టి సంకర్షణుడు తానే.

మూడవది అనిరుద్ధుడు. అతనిని సాధించుటకు ఎవ్వరికి సాధ్యముకాదు. అతని అనుగ్రహముచేతనే అతనిని సాధించవచ్చునుగాని, మరొక మార్గములో అతనిని సాధించుటకు ఏమాత్రము ఎవ్వరికిని వీలుకాదు. సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకతత్వమునకే 'అనిరుద్ధుడు' అని పేరు.

నాల్గవది ప్రద్యుమ్న. అనంతమైన ఐశ్వర్యమును కలిగినవాడు. భగవంతుని ప్రేమించినవారి అభీష్టము నెరవేర్చే నిమిత్తమై సర్వ సుఖములు సర్వ ఆనందములు అనుగ్రహిస్తూవుంటాడు. ఈ ఐశ్వర్యమనేది కేవలము ధనకనకవస్తువాహనాదులు మాత్రమే కాదు. ఆరోగ్యము ఐశ్వర్యమే, విద్య ఐశ్వర్యమే, బుద్ధి ఐశ్వర్యమే, గుణము ఐశ్వర్యమే, యివన్నీకూడను ఐశ్వర్యమునకు సంబంధించినటువంటివి. కనుక, సకలైశ్వర్యస్వరూపుడగుటచేత యితనికి 'ఈశ్వరుడ'ని మరొక పేరు. ఇంక భగవంతుడు. భగవంతుడనగా ఎవరు? యిక్కడ ఐశ్వర్యము, ధర్మము, సంపద, యశస్సు, జ్ఞానము, వైరాగ్యము యీ ఆరింటికి 'భగము' అని పేరు. ఈ ఆరింటియొక్క తత్త్వమునకు భగము అని పేరు. ఈ భగము కల్గినవాడు కనుకనే యితనికి 'భగవాన్' అని పేరు. భగవంతునియొక్క నామములు అన్నీ ప్రత్యక్ష, ప్రమాణములతో కూడినవేగాని కేవలము భక్తుల ప్రేమోన్మాదముచేత, వుచ్చరించినవికాదు. ఇట్టి సంవత్సర స్వరూపుడైనవాడు కనుకనే భగవంతునకు ఋషులందరు 'ఓం సంవత్సరాయ నమః' అని పిలుస్తూ వచ్చారు.

**ప్రవృత్తి జీవితము గడుపుతున్న మానవులకు నివృత్తితత్త్వము అర్థం కాదు**

సృష్టికి ప్రధానమైన కర్తయే భగవంతుడు, తానే సృష్టి స్వరూపాన్ని ధరించినవాడు.

sri sathyasai vachanamrutam

'ఏకోహం బహుస్యాం' తానే అనేక రూపములుగా రూపొందటం చేత యీ యుగమునకు 'యుగాది' అని మరొక పేరు. తాను ఒక్కడే అనంతముగా మారిపోతూవచ్చాడు. కాని, యీ అనేకత్వములో వుండిన ఏకత్వము ఏమిటి? సామాన్యముగా మనము భవనమును నిర్మించుకుంటాం. ఆ భవనమునందు ఒకటి వంటగది, ఒకటి స్నానాలగది, ఒకటి పడకగది యీ విధంగా ఒకదానికొకటి వేరువేరుగా నిర్మించుకుంటాం. ఈ రూములంతా ప్రత్యేకంగా వుండినంతవరకు ఆ రూపనామములు మనము వుచ్చరిస్తుంటాము. ఐతే యీ రూములు యేరీతిగా విభజించబడినవి? ఒక రూముకు, ఒక రూముకు మధ్య గోడలు నిర్మించటంచేతనే వేరువేరు రూములుగా తయారౌతూ వచ్చాయి. యీ అన్ని గోడలు కొట్టివేస్తే అంతా ఒక్కటే అయిపోతుంది, హాలు. అదే రీతిగా ఉపాధి భేదములు పురస్కరించుకొనియే వేరువేరు రూపనామములు ధరిస్తూ వుంటున్నది. ఈ ఉపాధి భేదములు పూర్తిగా దూరము చేసినప్పుడు ఏకాత్మ స్వరూపకంగా నిలుస్తుంది. ఈ విభజించుకునే అజ్ఞానము మానవునియందు కల్పితము. ఈ అజ్ఞానమును మనము ఉపాధిద్వారా దూరము గావించుకున్నప్పుడే జ్ఞానస్వరూపమైన ఆత్మతత్త్వము మనయందు ప్రకాశిస్తూవస్తుంది. ప్రతి మానవునియందు యిట్టి పవిత్రమైన ఆత్మతత్త్వము ఏకత్వముగానే వుంటున్నది.

**హృదయమనే క్షేత్రమందు కలదు ఒక్క కల్పతరువు**
**దాని చుట్టు వనస్పతుల కలుపుకంప పెరిగియుండు**
**కలుపుతీసి పారవేయ కల్పతరువు కానబడును**
**అదే మీ అభీష్టములొసగు దివ్య కల్పతరువు.**

మనలో ఆత్మ అనే కల్పతరువు వుంటున్నాది. ఈ వాంఛలు, అభీష్టములు, విషయములనేటువంటివి దానిచుట్టూ అల్లుకొనిపోయి వుంటున్నవి. మంచి పూలలతకు ముళ్లకంప అల్లుకున్నప్పుడు ఆ వృక్షమునే మరుగుచేస్తుంది. అదే విధముగనే మనయందుండినటువంటి పవిత్ర, దివ్య సంకల్పములనే కల్పతరువుకు యీ కోరికలు అనేవి అల్లుకొని దానిని మరుగు చేస్తూ వస్తున్నాయి. ఎప్పుడు యీ ముళ్లకంపను మనము



sri sathyasai vachanamrutam

తీసివేస్తామో అప్పుడు ఆత్మతత్త్వము మనకు కనుపిస్తుంది. అది మనయందుండినప్పటికి మనము దానిని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు.

**ఫలములోని మధురరసము తనకు తాను ఎరుగునా?**
**పూవులోని మకరందము తీగలనుభవించునా?**
**నివృత్తిసారసాహిత్యము ప్రవృత్తి పండితుడెట్టెరుగును**

ప్రవృత్తి జీవితము మనము గడుపుతున్నాము. నివృత్తి తత్త్వము మనకు అర్థం కావటంలేదు.

**అజ్ఞానము లేకుండా వర్తించేవాడే మానవుడు**

దేనిని మనము అర్థము చేసుకోవాలని ప్రయత్నిస్తున్నామో ఆయొక్క మార్గము లోపల ప్రవేశించాలి. దీనికి విశ్వాసము గాఢముగా వుంటుండాలి. ఈ విశ్వాసమే లేకపోతే మానసిక తత్త్వము మహాచంచలమైనది. ఈ చంచలత్వముచేత తన దివ్యమైన భావమును చెదరగొడుతుంది. మనము భగవంతుని ఉక్కుగుండువలె చలించని, భ్రమించని విశ్వాసముతో నమ్మాలి. మనము ఎండుటాకుగా తయారు కాకూడదు. ఎండుటాకు, ఉక్కుగుండు రెండు ఒక దగ్గర పెట్టి చూడండి. కొంత గాలి వీచెనా ఎండుటాకు ఎగిరిపోతుంది. ప్రళయమారుతమైనప్పటికిని ఉక్కుగుండు కదలదు. ఈనాటి మానవుడు కదలిపోయే ఎండుటాకువంటివాడే! కోరిక నెరవేరెనా సరే, లేకపోతే, పరుగెత్తి పోతుంటారు. ఏమాత్రము బలమైన శక్తి లేదక్కడ. అనగా energy లేకుండా వుంటున్నాది. ఆ energy నే దైవశక్తి. యిదంతా ఒక matter. యీ matter ను పట్టుకొని మనం ప్రయత్నిస్తున్నామేగానీ ఆ matter లో వుండిన దివ్యశక్తిని మనము అనుభవించటానికి కృషి చేయటంలేదు. కష్టములుగాని దుఃఖములుగానీ, బాధలుగానీ, నష్టములుగానీ సంభవించినప్పటికి మన మనసు కదలక చెదరక వుండేటువంటి దివ్యత్వమును మనము అనుభవించాలి. ఇదే నిజమైన భక్తి. ప్రతి మానవుడు పరిపూర్ణమైన విశ్వాసాన్ని అభివృద్ధి గావించుకోవాలి. తనను తాను నమ్మలేని మానవుడు మానవుడేకాదు. కేవలము జగత్తును, జగత్తులోని విషయములను నమ్మి విషయాలకు దాసుడౌతున్నాడు, మానవుడు. కాని, విష్ణువుకు దాసుడు కావటం లేదు. ఇలాంటి మానవుడు మానవుడని

sri sathyasai vachanamrutam

అనిపించుకోడు. ఈ అజ్ఞానము మననుండి దూరముగావించుకోవాలి. అదే మానవత్వానికి తగిన అర్థము. మా-న-వ. 'మా' అనగా అజ్ఞానము, 'న' అనగా లేకుండా, 'వ' అనగా వర్తించటము. అజ్ఞానము లేకుండా వర్తించేవాడే మానవుడు. మనము నరులుగా పుట్టాము. నరుడనగా ఎవరు? ఆత్మస్వరూపుడే! నాశములేనివాడే నరుడు. 'రః'-నాశనము. 'న'-కానటువంటిది. 'నరః' అనగా నాశనము కానటువంటివాడు నరుడు. నాశనమయ్యేది దేహము కానీ ఆత్మకాదు. కనుక 'నరః' అనగా 'ఆత్మ' అని మరొక అర్థము. ఆత్మస్వరూపుడైన మానవుడు దేహమును లక్ష్యమునందుంచుకొని ప్రాకృతమైన వాసనలకు లోభించి కాలము గడుపుతూ 'నేను దైవభక్తుడను,' 'దైవభక్తుడను' అనుకుంటే భక్తుడు ఏరీతిగా కాగలడు? ప్రకృతి భక్తుడవు నీవు. ఆ ప్రకృతిని పరమాత్మగా విశ్వసిస్తే భక్తికి అదికూడ సరియైన అర్థమే! కానీ అక్కడకూడను divide చేస్తున్నాడు, పరమాత్ముడు వేరు ప్రకృతి వేరు అని. ఈవిధమైన సాధనలు ఎన్ని సంవత్సరములు, ఎన్ని జన్మలు చేసినప్పటికి తనయొక్క తత్వాన్ని తాను గుర్తించుకోలేడు. కానీ, మానవుడు తెలివితేటలతో తన జీవితమును సాధించటానికి ప్రయత్నిస్తున్నాడు. ఈ తెలివితేటలుండి ప్రయోజనము ఏమిటి?

**నేటి విద్యలు తెలివితేటలనే పెంచు**
**కొంచెమైన గుణము పెంచబోవు**
**కోటి విద్యలుండి గుణము లేకున్నచో**
**విలువదేమి వాని ఫలమదేమి?**

ఇది కేవలము విలువలేని జీవితమే. గుణము కావాలి. గుణమును పోషించుకునే నిమిత్తమే మనము విద్యనభ్యసించాలి. ఆ గుణమంటే ఏమిటి? అదే ఆత్మతత్వాన్ని గుర్తింపచేసే గుణము. అట్టి ఆత్మతత్వము సర్వత్రా వ్యాపించినటువంటిది. ఇదే భాగవతమునందు

**చిత్రంబులు త్రైలోక్య ప**
**విత్రంబులు భవలతాల విత్రంబులు స**
**న్మిత్రంబులు ముని జన వన**

srisathyasaivachanamrutam

**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.**

భగవంతుని చరిత్రములు ఎట్లా వుంటాయంటే చిత్రంబులు, పవిత్రంబులు భవలతాలవిత్రంబులు. యిలాంటి తత్వములతోకూడినదే దైవత్వము. ఇది

**శబ్ద బ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ**
**నిత్యానందమయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ.**

అష్టైశ్వర్య స్వరూపమైన తత్త్వము, యీ దివ్యత్వము. ఈ ప్రకృతి అంతయు అష్టైశ్వర్యములతో కూడినటువంటిదే!

**ప్రతి మానవుడు దివ్యమైన పరతత్త్వమును ప్రకటింపజేసే నిమిత్తమై మానవునిగా ఆవిర్భవించాడు**

ప్రేమస్వరూపులారా! సృష్టి అనగా ఏమిటి? ఈశ్వరేచ్ఛకు ప్రకటనయే సృష్టి. దీని పేరే ప్రకృతి. ప్రకృతియందు ఉద్భవించిన ప్రతి మానవునకు కూడను పరమాత్మ గుణములే రావాలి. ఏనుగు కడుపులో పులి పుడుతుందా? లేక పులి కడుపులో జింక పుడుతుందా? అదే విధముగనే దైవత్వములో వచ్చిన దైవత్వమందు దైవత్వమే ఆవిర్భవించాలిగానీ రాక్షసత్వముగానీ పశుత్వముగానీ ఆవిర్భవించరాదు. దయారహితమైన మానవత్వము మానవత్వమే కాదు. ప్రేమరహితమైన మానవత్వము మానవత్వమే కాదు. కనుక ప్రతి మానవుడుకూడను దివ్యమైన పరతత్త్వాన్ని ప్రకటింపచేసే నిమిత్తమై మానవునిగా మూర్తీభవించాడు. కనుకనే, జీసస్‌కూడను అన్నాడు మొట్టమొదట I am the messenger of God. దైవత్వాన్ని ప్రపంచమంతా చాటే నిమిత్తమై వచ్చినాడు. కాబట్టి మెసెంజర్. ప్రతి మానవుడుకూడా ఒక్కొక్క మెసెంజరే! కానీ, దానిని మరచిపోతున్నాడు మానవుడు. Mis engines గా తయారైపోతున్నారు. అనగా తమ తత్త్వాన్ని తాము గుర్తించుకోటం మానివేస్తున్నారు. దాని బదులు అనేక మార్గములలో తమ జీవితమును ప్రవేశపెడుతున్నారు. 'ఎప్పుడు నేను భగవంతునియొక్క మెసెంజరు కాగలను,' అని గుర్తించినప్పుడే నీవు son of God గా రూపొందగలవు. Son of God అనే సంబంధములో కూడినప్పుడే I and my father are one అనేటువంటి ఏకత్వానికి వస్తావు. ఈ

srisathyasaivacharamrutam

ఏకత్వముయొక్క పరిణామమే Holy Ghost దీనినే 'తురీయావస్థ' అన్నారు. అనగా అతీతమైన స్థితి. శరీరమునకు, మనస్సుకు సంబంధములేని తత్త్వము. జాగ్రత్ స్వప్న సుషుప్తులకు అతీతమైన తత్త్వము. మానవత్వమును మొట్టమొదట ఒక దైవత్వంగా మనం భావించి, ఆ దైవత్వమును ప్రసరింపజేసే వ్యక్తిత్వముగా మనము విశ్వసించాలి.

ప్రేమస్వరూపులారా! 'వ్యక్తి' అనగా ఏమిటి? అవ్యక్తముగా మనయందు గుప్తముగా వుండిన దివ్యశక్తిని వ్యక్తీకరింపచేసినవాడే వ్యక్తి. లేకపోతే సామాన్యంగా మనం వ్యక్తిత్వమనే పదమునుపయోగించుకోటంలో అర్థం లేదు. అట్టివాడు మాత్రమే చారిత్రాత్మక వ్యక్తిగా తయారౌతాడు. అనగా చరిత్రకు, వ్యక్తిత్వమునకు సన్నిహిత సంబంధబాంధవ్యము వుంటున్నది. కాన మనము వ్యక్తిగా రూపొందవలెనన్న మనయందున్న ఆత్మతత్త్వాన్ని చక్కగా ప్రకటింప చేసుకోవాలి. ఇది మనము నూతనముగా ఆవిర్భవింపచేసుకునేదికాదు. సహజంగా వుండేటువంటిదే. దీనినే స్వభావము అన్నారు. స్వ-భావము. ఆత్మభావమే స్వభావము. ఆత్మశక్తియే మన స్వశక్తి. 'స్వామీ! మాకు శక్తిలేదు. నూతనమైన శక్తి మాకు అనుగ్రహింపుమ'ని కోరుతుంటారు. శక్తిలేనివానికి యింక యిచ్చి ప్రయోజనమేమిటి? శక్తివున్నది. ఉన్నదానినే సద్వినియోగం చేసుకోటంలేదు. నూతనంగా ఏరీతిగా వినియోగించుకోగలవు?

**ఆకారమే నేననుకోవటం అహంకారం**

మానవత్వములో మొట్టమొదట మనం నిర్మూలము గావించుకోవలసినది అహంకారం. ఈ పదమునందు వుండిన అర్థముకూడను మనం గుర్తించాలి. అహంకారమనగా పొగరుబోతుతనంగా లేక ఎవరు చెప్పినా వినకుండా వుండినప్పుడు అహంకారమనే పదమును వినియోగించుకుంటున్నాం. ఇది కాదు దీని అర్థము. అహం, ఆకారం. ఆకారమే నేననుకోవటం అహంకారం. 'అహం ఆకారం'. 'నేను దేహాన్ని' అని అనుకోవటమే అహంకారము. దానిని నీవు నిర్మూలం చేసుకోవాలి. అంతేకాని యిష్టానుసారం ప్రవర్తించేది కాదు, అహంకారం. ఇది పశుత్వానికి లక్షణం. కనుక, మనము ప్రతిపదములో గల అంతరార్థాన్ని గుర్తించాలి. యిది ఒక వెండి పళ్లెం. ఒక పదార్థము. పదార్థమనగా ఏమిటి?

sri sathyasai vachanamrutam

పదమునకు అర్థమే పదార్థము. ఇప్పుడు 'చైర్' అనే పదము వుంది యీ చైర్ అనే పదమునకు చైరే అర్థము. జగత్తంతయు పదములతోకూడిన అర్థములే! కనుక, జగత్తులో సర్వము పదార్థములుగా రూపొందుతూ వచ్చాయి. అర్థములేని పదము జగత్తులో కానరాదు. 'గగనకుసుమము' అనవచ్చును. కానీ అది లేదే! మరి యీ పదము ఎట్లా వచ్చింది? అయితే, యిది పదముకాదు, సమాసము. 'గగనము' ఒక పదము, 'పుష్పము' మరొక పదము. ఈ రెండు పదములు చేర్చినారు. అట్లు రెండు పదములు చేర్చినటువంటి పదములకు అర్థము వేరు. అర్థములేని పదము జగత్తులో కానరాదు. కనుక, 'భగవంతుడు' అనే పదము ఒకటి వచ్చింది. ఇది లేనిదే ఎట్లా వచ్చింది? లేనిది రావటానికి వీలుకాదు. నాకు కనుపించలేదే అని మీరు వాదించవచ్చును. కానీ, కనుపిస్తూ వుంటున్నాది. 'పశ్యన్నపిచ పనశ్యతి మూఢో' చూస్తూనే వుంటున్నాడు జగత్తును. జగత్తును చూడలేదంటున్నాడు. యిది మూఢత్వం కాదా? జగత్తుది ఏరూపము? దైవముకాదా? కాబట్టి, దైవమును జగద్రూపములో చూస్తున్నావు. దీనినే భగవద్గీతయందు 'విశ్వవిరాట్ స్వరూపము' అన్నారు. విశ్వమంటే ఏమిటి? విశ్వమంటే లోకమే! కనుక, విశ్వవిరాట్ స్వరూపమనగా ఏమిటి? సమస్తరూపములు ఏకత్వముగా వుండిన స్వరూపము విశ్వవిరాట్ స్వరూపము. కనుక, జగత్తే విశ్వవిరాట్ స్వరూపము. ఈ విధమైన సూక్ష్మార్థములు మనం గుర్తించుకోటానికి ప్రయత్నించటం లేదు. యుక్తులు, కుయుక్తులు ప్రవేశపెట్టి మన తెలివితేటలను వుపయోగపెట్టి దీనిని అనేక అనర్థాలుగా మనం అభివృద్ధి గావిస్తున్నాం. నీ తెలివితేటలు ఎంతవరకు? నీకా మతి స్థిరములేదు. అలాంటి స్థిరములేని మతినుండి వచ్చే భావము స్థిరమైనదా! ఎంతో మేధాశక్తి కల్గి, సర్వసంగ పరిత్యాగియై కర్తవ్యమును నిర్వర్తించినట్టి అర్జునుడే "చంచలంహి మనః కృష్ణా" అన్నాడు. అర్జునునికంటే నీవు గొప్పవాడవా? అర్జునునియొక్క తెలివితేటలకంటె నీ తెలివితేటలు గొప్పవనా? ఈనాడు నీవు MBA, Ph.D., అన్నీ చదివివుండవచ్చును. కానీ అర్జునునికి MBA లేదు Ph.D. లేదు. యీ తుచ్ఛమైన డిగ్రీలు తీసుకోటమా గొప్పతనము? ఇవి గొప్ప విద్యలు కాదు. భగవంతుని అనుగ్రహమనే డిగ్రీ పొందాడు. "శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రః" అన్నారు. 'నీవు అమృత పుత్రుడవు. నీవు నా భక్తుడవు' అన్నాడు. "మన్మనా...మద్భక్తో" నీవు నా

sri sathyasai vachanamrutam

భక్తుడవన్నాడు. అది పెద్ద అర్హత. భగవంతుడే 'నాయనా! నీవు నా భక్తుడు,' అని అంటున్నాడు. ఆ స్థితిని మీరు సంపాయించుకోండి, మీరు అర్జునునితో సమానులౌతారు. భగవంతుడు నా 'భక్తుడు నీవ'ని చెప్పటం లేదే! నిజంగా మీరు భక్తులైతే భగవంతుడు ఎందుకు పిలవడు? కనుక, భగవంతుని భక్తులమని మనం అనుకోటంకాదు, గొప్పతనము. భగవంతుడు మనల్ని భక్తులని పిలవాలి. ఒక కవరు వ్రాసి నీకు నీవు చేతిలో పెట్టుకొని నాకు చేరిందని అంటే చేరినట్లా? ఒక వేళ నీవు ఒక రిజిష్టర్డ్ లెటరు ఒక ఫ్రెండుకు వ్రాసావు అనుకుందాం. కానీ, అక్కడకు చేరినట్లు నీకు ఎట్లా తెలుస్తుంది. ఆ ఫ్రెండునుండి నీకు ఎక్నాలెడ్జ్‌మెంట్ వస్తే లెటరు చేరినట్లు. కాబట్టి, నీ భక్తి అనే లెటరు నీవు భగవంతునికి పంపినప్పుడు, భగవంతుడు 'నీవు నా భక్తుడ'వని ఎక్నాలెడ్జ్‌మెంట్ పంపాలి. అది నీకు రానంతవరకు నీవు భక్తుడవే కాదు. కాబట్టి, ఆ లెటరు భగవంతునికి చేరలేదు. ఎక్కడకు పోయింది, మరి? ఐతే నీవు ఎడ్రస్సు తప్పుగా వ్రాసి వుండవచ్చు. మన పురాణాలలో 'భగవంతుడు కైలాసవాసి, స్వర్గవ్యాపి, వైకుంఠవాసి,' అని యీ విధంగా ఎడ్రస్సులు చెబుతుంటారు. ఈ అడ్రస్సులన్నీ కేర్ ఆఫ్ ఎడ్రస్సులు మాత్రమే! నిజమైన ఎడ్రస్సు 'హృదయవాసి'.

**దేహము పరోపకారార్థమై వచ్చింది**

నీ conscience కు తృప్తివచ్చేంతవరకు నీవు ప్రయత్నించాలి. నీ conscience నీకు తృప్తిగాలేదు. భగవంతుడు తృప్తిపడినట్లు నీవు యేరీతిగా చెప్పగలవు? ఇది అసాధ్యము. ఇది సాధ్యము కావాలంటే మన పవిత్రతను మనం అభివృద్ధిపరచుకోవాలి. అనగా, దుర్గుణములను, దురాలోచనలను, దుశ్చింతనలను కొంతవరకు మానుకోవాలి. ఈ దేహము పరోపకారార్థమై వచ్చింది. 'పరోపకారార్థ మిదం శరీరం'. ఐతే యీ పరోపకారము ఏరీతిగా చెయ్యాలి? మనము ధర్మంగా పరోపకారము చేయాలి. ఒక చిన్న ఉదాహరణము. మహాభారతమందు సత్యధర్మస్వరూపుడైన ధర్మరాజు ఆత్మ. అగ్నినుండి ఆవిర్భవించిన ద్రౌపది శక్తి. ఆమె ప్రకృతి. వాయు పుత్రుడైన భీముడే ప్రాణము. ఇంద్రప్రసాదమైన అర్జునుడే అహంతత్వము. నకులసహదేవులు కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములు. ఐతే, యీ కర్మేంద్రియ

sri sathyasai vahinimrutam

జ్ఞానేంద్రియములు, యీ ప్రాణమనస్సులు మరియు ప్రకృతి స్వరూపమైన ద్రౌపదికూడను సత్యధర్మస్వరూపుడైన ధర్మరాజును అనుసరిస్తూవచ్చారు. అనగా, పాండవులందరు సత్యధర్మములనుసరించటంచేతనే వారు ధన్యులై యుగయుగములందు ఆదర్శప్రాయులైన మూర్తులుగా రూపొందారు. అనగా, కర్మేంద్రియ జ్ఞానేంద్రియములన్నీకూడను సత్యధర్మాన్ని అనుసరించాలి. మనస్సు, అహంతతత్వముకూడను సత్యధర్మాన్ననుసరించాలి. వీనినే పంచకోశములని పిలుస్తూ వచ్చారు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయములు అనే పంచకోశములచేత కట్టబడినది, యీ ఆత్మతత్త్వము. ఈ కట్టబడిన పంచకోశములనే దారములు త్రుంచివేసినప్పుడు ఆత్మ సులభంగా మనకు లభ్యమవుతుంది. కానీ, వీటిచే కట్టబడిన ఆత్మ స్వతంత్రమైన జీవితమునసుభవించాలంటే యిది అసంభవము, అసాధ్యము. తట్టలో వున్న పదార్థము పొట్టలో చేరాలంటే నోటికి, చేతికి పనిపెట్టాలి. కనుక, చేతితో సత్కర్మలాచరించాలి. నోటితో దైవచింతన చేయాలి. ఈ రెండింటి ఏకత్వమే బ్రహ్మతత్త్వము. నోటితో భగవచ్చింతన చేసినంతమాత్రమున చాలదు. గ్రామఫోను ప్లేటు, టేపురికార్డు పాడుతుంటాయి. మీరూ పాడుతున్నారు. ఆ పాటలు, పాటలుకాదు. ఆ నాదము హృదయమునుంచి రావాలి. రికార్డు చేస్తారు, నేను మాట్లాడినవి, పాడినవి అన్నీ. కానీ, టేపు తీసి చూస్తే కనుపిస్తున్నాయా? ముక్కలు ముక్కలుగా కత్తిరిస్తే మనకు వినిపిస్తున్నాయా! అంతమాత్రముచేత ఆ టేపులో మాటలు లేవని భావించటానికి వీలవుతుందా? ఆ టేపులో పదములు, శబ్దాలంతా వున్నాయి. దానిని వినాలంటే ఏమి చేయాలి? ఈ టేపును కరెంటుకు connection చేయాలి. అప్పుడు దానిలో వున్న శబ్దాలంతా వినిపిస్తాయి. కనుక నీ హృదయములో టేపు చేసుకో. దానిని ఆత్మతత్త్వముతో connection చేయి. అప్పుడు నీకది నిరంతరము ఓం ఓం అని ప్రతిధ్వనింప చేస్తూ ఆనందంగా వినిపిస్తుంది. అదే శబ్దబ్రహ్మము.

**నిశ్శబ్దములోని శబ్దమే బ్రహ్మము**

మనము చేసే శబ్దాలంతా బ్రహ్మములుకాదు. ఎన్నో శబ్దాలు చేస్తున్నాం. కానీ, నిశ్శబ్దములోని శబ్దమే బ్రహ్మము. నీవు ఏకాంతములో కూర్చున్నప్పుడు అక్కడనుండి ఒక విధమైన శబ్దము ప్రారంభమవుతుంది. అదే నిశ్శబ్దములోని శబ్దమే బ్రహ్మము. ఒకానొక

sri sathyasai vahini

సమయములో రామకృష్ణుడుకూడా చెప్పాడు. భగవంతుడు ఎప్పుడు వస్తాడో ఎప్పుడు నన్ను అనుగ్రహిస్తాడో అని చాలా నిశ్శబ్దంగా వుండేవాడు. ఒకానొక సమయంలో రాణీ రాసమణి ప్రశ్నించింది. 'రామకృష్ణా! ఎందుకు యింత నిశ్శబ్దాన్ని పాటిస్తున్నావ'ని. భగవంతుడు అతిసూక్ష్మ స్వరూపుడు. "అణోరణీయాన్ మహతో మహీయాన్." అణువులో అణువు, గొప్పవారిలో గొప్పవాడు. మనం అనేక శబ్దాలు చేస్తుంటే భగవంతుడు ఎప్పుడు వస్తాడో అతని శబ్దము మనకు వినిపించదు. నిశ్శబ్దముగా వున్నప్పుడు శబ్దం చేసుకుంటూ వస్తుంటే ఆ శబ్దాన్నే మనం వినాలి. అతను నిశ్శబ్దములో యేకించిత్ శబ్దమైనా తక్షణం లేచి చూచేవాడు. ఆ నిశ్శబ్దములో శబ్దమే దైవశబ్దము అని. అట్టి శబ్దాన్ని మనం వినాలనుకున్నప్పుడు మనం చేసే శబ్దాలలోపల వినిపిస్తుందా? అతనిపై మనం concentration చేయగలమా? ఏకాగ్రత వస్తుందా? ప్రతిమానవుడు సాధ్యమైనంతవరకు మాటలను తగ్గించుకోవాలి. మాటలను క్రమక్రమేణా తగ్గించుకున్నప్పుడు తనలోనుండి ఆత్మశబ్దము ప్రారంభమవుతుంది. మన ఉచ్ఛ్వాసనిశ్వాసములకంటె అతిసూక్ష్మంగా వుంటుంది. దానినే రామకృష్ణుడు 'పరమభక్తి' అన్నాడు. లోకములో పంచభూతములుమాత్రమే వుంటున్నాయి. ఇవికాక, యింకొక భూతము వున్నాడనుకుంటే ఆ భూతము దైవత్వమే! ఆ దైవత్వమునకు పెట్టిన పేరే ప్రపత్తి. ఆ ప్రపత్తిని మనం సాధించాలి. ఆ ప్రపత్తిని సాధించినప్పుడే దైవత్వమనేది ప్రతినిమిషమునందు మనము అనుభవించవచ్చును.

నూతన సంవత్సరము రావాలనుకుంటే ఒక సంవత్సరమువరకు మనము కాచుకోనక్కరలేదు. ఒక సంవత్సరము కావాలనుకుంటే 12 నెలలు కావాలి. ఒక నెల కావాలనుకుంటే 30 దినములు కావాలి. ఒక దినము కావాలంటే 24 గంటలు జరగాలి. ఒక గంట కావాలంటే 60 నిమిషములు జరగాలి. ఒక నిమిషం మనకు కావాలంటే 60 సెకండ్లు జరగాలి. కనుక, ఒక్కొక్క సెకండు నూతనంగా మనం భావించాలి. సెకండ్లు లేక నిముషములు లేవు. నిముషములు లేక గంటలు కాలేదు. గంటలు లేక దినములు కాలేదు. దినములు లేక నెలలు కాలేదు. నెలలు లేక సంవత్సరము కాలేదు. కాబట్టి సంవత్సరమువరకు కాచుకోటం సోమరితనం. ప్రతి సెకండును నూతనంగా భావించాలి.

srisathyasaivachanamrutam

## భగవంతునికి రాకపోకలు లేవు

తత్-త్వం-అసి. అది నేనే! కానీ అదే నేను అనుకుంటే ఏకముకాదే! ఆ రెండింటిని మనం ఏకత్వము చెయ్యాలి. చక్కెర చక్కెరగా వుంది. నీరు నీరుగా ఉంది. నీరు, చక్కెర రెండింటిని ఏకము చేసినప్పుడే పానకంగా తయారౌతుంది. 'తత్' అది, 'చిత్' యిది-యీ రెండింటిని చేర్చిన ఆనందమనే సిరప్‌గా మారిపోతుంది. ఈ రెండింటిని ఏకం చెయ్యాలి. అదే యీనాడు మనము చేయవలసిన పని. ప్రతి సెకండును భగవత్ స్వరూపముగా తీసుకోవాలి. ఇది కేవలము క్రీస్తుశకంగా భావిస్తూ వచ్చిన సంవత్సరము. డిశంబరు, జనవరి రావచ్చు, పోవచ్చు. కానీ భగవంతుడు రాడు, పోడు. యిందులో మనం మూడింటిని గుర్తించటానికి చక్కగా ప్రయత్నించాలి. ఒకటిపోతే తిరిగి రాదు. రెండవది వస్తే మరిపోదు. మూడవది రాదు, పోదు. వచ్చిపోకుండా ఉండేది ఏమిటి? జ్ఞానము. నిజంగా మనకు జ్ఞానం వచ్చిందంటే తిరిగి అది ఎప్పుడూ పోకూడదు. వచ్చి, పోయేది నిద్ర. నిజమైన జ్ఞానం ఒకతూరి వచ్చిందంటే పోవటానికి వీలుకాదు. ఆవిధంగా పోయేది జ్ఞానం కాదు. ఒకతూరి పోయెనా తిరిగిరాదు. అది అజ్ఞానము. పోయి తిరిగి వచ్చిందంటే అది అజ్ఞానంలో అజ్ఞానం. దానినే మిథ్యలోని మిథ్య అన్నారు. ఇక రాదు, పోదు. అదే ఆత్మతత్త్వము. సర్వత్ర వుండేది, పోయేదెక్కడ? పోవటానికి వేరే స్థలము వుంటేకదా? ప్రత్యేక స్థలము వుంటే యిప్పుడు మనం తలుపులు పెట్టాము. బయట వరండా వుండటంవలన యిక్కడ తలుపులు పెట్టాము. బయట ప్రదేశము వుంది, కావున బయటకు ద్వారం అవసరం అయింది. బయట ప్రదేశమే లేకపోతే మనం ద్వారం పెట్టము. ఐతే బయట ప్రదేశముంటేకదా, బయటకు పోవటము! స్థానమేలేదు, ఎక్కడికి పోయేది, ఎక్కడకు వచ్చేది? యివన్నీ గ్రంథములు చదివి బుర్రలు చెడగొట్టుకుంటున్నాం. మనం practical knowledge లో పెట్టాలి.

దీనినే గోపికలు చెప్పారు. 'వేయబోవని తలుపు తీయమంటూ పిలుపు'. ఒకవైపున మనసులోని తనయొక్క సందేహము 'తలుపు వేసుకో' అని చెబుతుంది. విశ్వాసము ఏమి చెబుతుంది? 'తీయమ'ంటూ పిలుపు. యిక్కడ విశ్వాస, అనుమానాలు రెండూ చేరటంవల్ల

srisathyasaivachanamrutam

రాధకు నవ్వు వచ్చిందట! 'రాధకెందుకో నవ్వు గొలుపు' ఈ విశ్వాస, అవిశ్వాసములతోకూడిన మనస్సుకు యిదే గతి. 'విశ్వమంతా ప్రాణవిభుని మందిరమైన వీధి వాకిలి ఏదటో' వీధి వాకిలి ఏది? అప్పుడు రాధ చక్కని జవాబు చెప్పింది. 'వీణతంత్రులు మీటి ప్రాణతంత్రులు నాటి ఆనంద బాష్పములు ఆత్మార్పణము చేయ వీధి వాకిలి అదియెరా?' ఆత్మార్పణే వీధి వాకిలి. ఈ అర్పణగావించకుండా వుండినంతవరకు వీధి వాకిలి వుండనే వుంటుంది. ఐతే వీధి వాకిలి దేనికోసం నిర్మించుకున్నావు? మనము పోవటానికి, రావటానికి, మనకి సంబంధించిన వ్యక్తులు రావటానికి, పోవటానికి పెట్టుకున్నాం. కానీ, కలియుగ ప్రభావమువలన ద్వారం పెట్టినాము కదా అని వీధిలో పోయే కుక్కలు, పందులు, గాడిదలు అన్నీ లోపలకు వచ్చేస్తున్నాయి. యిదే దోషము. వాటిని విడువకూడదు. ఈ అహంకార మమకారములనేవి యేమాత్రము ప్రవేశపెట్టకూడదు. అట్టి ద్వారమును మనం పవిత్రముగా ఉంచుకోవాలి. "విశ్వమంతా ప్రాణవిభుని మందిరము" వీధి వాకిలే లేదు. ఈ వీధి వాకిలి ఆత్మార్పణమే.

కనుక, నిజంగా సంవత్సరము రావటము, పోవటమనేది ఒక సంవత్సరమునకు వీడ్కోలు, యింకొకదానికి స్వాగతమునకు సంకేతము.యిది ప్రాకృతమునకు సంబంధించినది. సిద్ధాంతి లెక్కల ప్రకారము యీ సంవత్సరము దాటింది, కొత్తది వచ్చింది. దీనిని మనము అనుసరిస్తున్నాము. యివన్నీ కల్పితములేగాని శాశ్వతములుగానీ, సత్యములుగానీ కాదు. సూర్యచంద్రాదులు ఎక్కడికి పోవటంలేదు. భూమధ్యరేఖపైకి వచ్చినప్పుడు పగలంటున్నాము, క్రిందకిపోయిన రాత్రి అంటున్నాము. నిజానికి రాత్రి, పగలే లేదు. తూర్పు, పడమర లేదు. యింక రావటం, పోవటం ఎక్కడనుండి వచ్చింది? ఇవన్నీ మనస్థాయిలో వుండినవారము భ్రమించే భ్రమలు. భగవంతునికి రాకపోకలు లేవు. రాకపోకలు లేని చక్రవర్తి భగవంతుడు. ఆ లోపల ప్రవేశించటానికి తగిన అర్హత పొందాలి. అందరికి దానిలో ప్రవేశించటానికి అర్హత లేదు. ప్రతి మానవుడుకూడను ఆ అర్హతను సంపాదించటంకోసమే ప్రయత్నించాలి. దాని నిమిత్తమే మనము యీ మానవత్వమును ధరించాము. దానికి తగిన కర్మలు మనం చెయ్యాలి. "కర్మానుబంధీని మనుష్యలోకే" మనిషి కర్మచేత బంధింపబడ్డాడు. ఏ కర్మలు? సత్కర్మలు చేయండి. పవిత్రమైన పలుకులు

srisathyasaivachanamrutam

పలకండి. పవిత్రమైన సంకల్పాలు అభివృద్ధి పరచుకోండి. దీనిద్వారా పవిత్రమైన హృదయాన్ని పొందండి. అప్పుడే పవిత్రత మనలో ఆవిర్భవిస్తుంది.

**(తేదీ 01-01-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam